# పని యెడల బైబిలు పరమైన దృష్టి విధానము

ఆషిష్ రాయ్‌చూర్

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | పని చేయుట దేవుని ఉద్దేశము | 1 |
| 2. | పని యెడల తప్పుడు ఆలోచనా విధానములు | 3 |
| 3. | పని యెడల విశ్వాసి దృష్టి కోణం | 6 |
| 4. | విశ్వాసులు పనిచేయవలెనని ఆజ్ఞాపించబడ్డారు | 10 |
| 5. | 7 సరియైన ఆలోచనా విధానములు | 17 |
| 6. | మీ పనిని గూర్చిన వాగ్ధానాలు | 21 |
| 7. | నూతన రాజ్యంలో పనిచేయుట | 24 |

# 1

# పనిచేయుట దేవుని ఉద్దేశము

**"దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాలా మంచిదిగా నుండెను. అస్తమయమును ఉదయమును కలుగగా ఆరవ దినమాయెను" (ఆది. 1:31).**

**"ఆకాశమును, భూమియు వాటిలోనున్న సమస్త సమూహమును సంపూర్తి చేయబడెను. దేవుడు తాను చేసిన తన పని ఏడవ దినములోగా సంపూర్తిచేసి తాను చేసిన తన పని యంతటి నుండి యేడవ దినమున విశ్రమించెను. కాబట్టి దేవుడు ఆ యేడవ దినమును ఆశీర్వదించి పరిశుద్ధ పరచెను. ఏలయనగా దానిలో దేవుడు తాను చేసినట్టియు, సృజించినట్టియు తాను పని అంతటినుండి విశ్రమించెను"(ఆది 2:1-3).**

మనమిక్కడ దేవుడు పనిచేయుటను చూస్తాము. ఆయన ఆరు దినములు పనిచేసి యేడవ దినమున విశ్రాంతి తీసుకొన్నాడు. అయితే దేవుడు మనుష్యుల వలె అలసిపోయి విశ్రాంతి తీసుకొనలేదు. సృష్టి కార్యాన్ని సంపూర్తి చేయుట కొరకు ఆయన చేయవలసిన దానినంతటిని ఆయన జరిగించాడు. ఆయన దేనిని చేసాడో వాటిని మంచిదిగా మరియు సంపూర్తియైనదిగా చూసాడు. కాబట్టే కొంత సమయం విశ్రాంతి తీసుకున్నాడు.

కాని, ఆదాము పాపములో పడిన క్షణము నుండి దేవుడు మరలా పనిచేయదాన్ని ప్రారంభించాడు. ఈసారి మనుష్యుని తిరిగి తన యొద్దకు తీసికొని వచ్చు నిమిత్తమై విమోచనా కార్యమును ప్రారంభించెను. అప్పటి నుండి మానవాళి కొరకైన తన విమోచన ప్రణాళికను బయలుపరచుచూ దేవుడు నిత్యము పనిచేయుచూ ఉన్నాడు.

**"మరియు దేవుడైన యెహోవా నరుని తీసికొని ఏదెను తోటను సేద్యపరచుటకును దాని కాచుటకును దానిలో ఉంచెను" (ఆది. 2:15).**

దేవుడు ఆదామును ఏదేను తోటలో ఉంచి, "ఆదామా, నీవు చేయాల్సినదల్లా, నన్ను ఆరాధించడమే" అని చెప్పలేదు. పతనము చెందకుముందే, దేవుడు ఆదాముకు ఒక పనిని ఇచ్చాడు. "భూమిని సేద్యము చేయుట" (Message Bible) మరియు తోటను చక్కగా కాపాడటం. ఇదే ఆదాము పని, అతని ఉద్యోగం. పతనానికి ముందే దేవుడు "పనిచేయుట" అనే ఉద్దేశాన్ని ప్రవేశపెట్టాడు.

ఆదాము పతనము చెందిన తరువాత కూడా భూమిని సేద్యపరచుటలో

కొనసాగాడు, అయితే ఇప్పుడు భూమి శపింపబడింది మరియు దాని నుండి ఫలము పొందుటకు ఆదాము మరి ఎక్కువగా శ్రమపడాలి. (ఆది 3:17–19). వివాహము దేవుని ఉద్దేశమని మనమందరము నమ్ముచున్నాం — కాబట్టి వివాహమును బట్టి మనం ఆనందిస్తున్నాం. సంఘం దేవుని ఉద్దేశమని మనకు తెలుసు—కాబట్టి మనం సంఘం బట్టి ఆనందిస్తున్నాం. శుభవార్త ఏమనగా పని కూడా దేవుని ఉద్దేశమే. దీనిని దేవుడే నియమించాడు! కాబట్టి పనిచేయుటను ఆనందించు!

**దేవుడు పనిచేసాడు.**
**దేవుడే పనిని నియమించాడు.**
**కాబట్టి దీనిని చేయుటలో ఆనందించు**

# 2

# పని యెడల తప్పుడు ఆలోచనా విధానములు

## పని ఒక ఆటంకముగా భావించే వైఖరి :

మనలో చాలా మంది దేవుని ఉద్దేశాన్ని మరియు ప్రణాళికను నెరవేర్చుటను గూర్చి అత్యుత్సాహులై ఉన్నారు. అయితే, మనకొక 'ఉద్యోగం' ఉంది, వారానికి ఐదు లేక ఆరు రోజుల పాటు పనికి వెళ్ళాలి. "ఈ పనిని గాని నేను వదిలించుకుంటే నేను యేసుక్రీస్తు సేవలో స్వేచ్ఛగా కొనసాగ గలిగేవాడ్ని" అని కొన్నిసార్లు తలంచి యుండవచ్చు. మన పరలోకపు పిలుపును నెరవేర్చుటకు మన 'ఉద్యోగము' లేదా 'పని' ఓ గొప్ప ఆటంకముగా కనబడుతుంటుంది. అది ఒక తప్పుడు వైఖరి. మనము ఈ భూమిపై ఉన్నంతకాలము మనము పనిచేయ వలసి యున్నదని మనము గుర్తుంచుకోవాలి—సంపూర్ణకాల పరిచారకులు కూడా.

నేను బెంగుళూరులోని బిషప్ కాటన్ బోయ్స్ స్కూల్‌లో చదువుతున్నప్పుడు 12 సంవత్సరాల వయస్సులో రక్షింపబడ్డాను. నేను యేసు కొరకు రగిలింపబడి అవకాశము దొరికిన ప్రతిసారి నేను ఆయనను గూర్చి ప్రకటించాను. ప్రకటించుటకు కొన్నిసార్లు నా అంతట నేనే అవకాశాలను సృష్టించాను. నేను నా తరగతి గదిలో నిలువబడి నా తోటి విద్యార్థులందరికీ యేసుని గూర్చి చెప్పడం నాకు జ్ఞాపకముంది. క్రీస్తుని ప్రకటించుటకై నేను దగ్గర్లోని మరి రెండు పాఠశాలలకు - బాల్డ్‌విన్ బోయ్స్ స్కూల్ మరియు కేథడ్రల్ స్కూల్‌కు వెళ్ళుటను ప్రారంభించాను. ఏమైనప్పటికీ, స్కూల్‌కి హాజరవ్వడం అనేది 'మొగ్గ తొడుగుతున్న' నా పరిచర్యకు ఓ గొప్ప ఆటంకంగా తోచింది, మరియు 'విద్య' అన్నమాట ఆశీర్వాదం కంటే మహా ఆటంకంగానే కనబడింది. నాలోని ఒక రహస్య ప్రార్థన ఉండినట్లు కనబడింది: "ఓ దేవా నన్ను దీనినుండి విడిపించుము. ప్రభువా నన్ను గాని స్కూలుకు వెళ్ళడం మరియు చదవడం నుండి తప్పించి స్వతంత్రుడ్ని చేస్తే, నీ రాజ్యము కొరకు మరి ఎక్కువగా పని చేయగలను, మరి ఎక్కువ మందికి యేసును ప్రకటించగలను". దేవునికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను, ఆయన దానినుండి నన్ను తప్పించలేదు! విద్యాభ్యాసము యొక్క పూర్తి ప్రక్రియ గుండా వెళ్ళి ఆ పిమ్మట ఇంజనీరింగు కళాశాల చేరుకున్నాను, అలా కొంతకాలము గడచిన తరువాత, నేను ఎందుకు చదవాల్సి వచ్చిందో గ్రహించుట ప్రారంభించాను. చదువు ఆపమని ఆయన నాకు చెప్పలేదు, దేవునికి వందనాలు. కాని ఒకానొక సమయంలో దేవుని ఉద్దేశ్యాలు నెరవేర్చుటలో విద్య,

స్కూలుకి హాజరవ్వడం అనేవి ఓ పెద్ద ఆటంకముగా కనబడినవనే నేను చెప్పాలి. నా బైబిల్ పఠనముతోను, ప్రార్థనతోను, సాక్ష్యమివ్వడం మరియు ప్రసంగించడంతో చదువుకు సంబంధించిన పుస్తకాల అధ్యయనం, నా హోమ్ వర్క్ మరియు పరీక్షలను పోల్చి చూసినప్పుడు ఇవన్నీ అంత ప్రాముఖ్యమైనవిగా కనబడలేదు. పనియెడల ఇదొక తప్పుడు వైఖరియని ఆ తరువాత గ్రహించాను.

## పని ఒక బంధకమనే వైఖరి :

కొంతమంది పనిని ఒక బంధకంగా భావిస్తారు. వారు పనిలో ఖైదు చేయబడ్డ పనివారిగానో లేక బానిసలుగానో భావిస్తారు. “నాకు ఇష్టమున్నా లేకున్నా సరే, ఉదయానే లేవాలి, పనికి వెళ్ళాలి” అని వారెల్లప్పుడూ ఆలోచిస్తుంటారు. పనిలోని నియమాలు, పద్ధతులు పరిస్థితులను మరింత పాడుచేస్తాయి. మనము పనిచేసే స్థలాన్ని బట్టి, బహుశా మనమక్కడ ఉదయం 9 గంటలకు ఉండాలి మరియు సాయంత్రం 6 లేదా 7 గం॥ల వరకు పని చేయాల్సి ఉంటుంది. పనిలో, మనకు బహుశా కొన్నింటిని చేయడానికి మాత్రమే స్వేచ్ఛ ఉంటుంది, వేరే వాటిని చేయుటకు అనుమతి ఉండదు. దీనికి కట్టుబడి యుండడం వలన కొందరు పనిని ఒక బంధకముగా భావిస్తారు. మనలో కొందరు నిబంధనల్ని మరియు అధికారులను వ్యతిరేకిస్తూ తిరుగుబాటు చేస్తారు.

పనిలోని నిబంధనలు బంధకాలు కావుగాని అవి వాస్తవానికి క్రమశిక్షణకు మార్గమును సరాళము చేయుటకు దోహదపడతాయని మనము గ్రహించాలి. బంధకానికి మరియు క్రమశిక్షణకు మధ్యగల వ్యత్యాసాన్ని మనము చూడాలి. మనము క్రీస్తునందు స్వేచ్ఛ మరియు స్వతంత్రతను కలిగియున్నాం (గలతీ 2:4; 5:1; 2కొరింథీ 3:17). అయినను మనము క్రీస్తునందు కలిగియున్న స్వేచ్ఛకు కూడా సరిహద్దులున్నాయని మనము గ్రహించాలి (గలతీ 5:13). అందువలన మనము కోరిన వాటన్నింటిని చేయకూడదు. కాబట్టి పనిని బంధకముగా చూడకూడదు గాని ఒకడు తనను తాను క్రమశిక్షణలో పెట్టుటకు అదొక అవకాశముగా చూడాలి.

## పని ఓ తప్పనిసరియైన తలనొప్పి అనే వైఖరి :

కొంతమంది ప్రజలు పనిని ఒక తప్పనిసరియైన తలనొప్పిగా భావిస్తారు. అవసరతలు తీరడానికి తప్పక చేయాల్సిందన్నట్లు తలస్తారు. అవును మనం బ్రదకడానికి మరియు మన కుటుంబాలను పోషించుటకు మనం పని చేయవలసి యుంది. ఏమైనప్పటికీ, అనేకులు తమ పనిని బట్టి ఆనందించరు సరికదా దానికి బదులు

పిర్యాదులు చేయడం, సణుగుకోవడం చేస్తుంటారు. విశ్వాసులుగా మన పనిని ఒక తప్పని సరియైన తలనొప్పిగా భావించుటను ఆపి మన పనిలో ఆనందించుటను నేర్చుకోవాలి.

## పని ఒక ఆరాధన అనే వైఖరి :

కొంతమంది ప్రజలు పనిచేయుటే ఆరాధన అనే తప్పుడు అభిప్రాయంతో నిరంతరం పనిచేస్తూనే ఉంటారు. ఈ వైఖరి మన పని విధానాన్ని శాసిస్తున్నది. పని ఆరాధన కాదు, ఎందుకంటే దేవునితో సంబంధమే ఆరాధన. దేవుని గూర్చి సహితం ఆలోచింపక నీవు పనిలోనే నిమగ్నమైపోగలవు కూడా.

**పని యెడల తప్పుడు ఆలోచనా విధానములు**

**పని ఒక ఆటంకంగా**
**పని ఒక బంధకంగా**
**పని ఒక తప్పనిసరియైన తలనొప్పిగా**
**పని ఒక ఆరాధనగా**

# 3

# పని యెడల విశ్వాసి దృష్టి కోణం

విశ్వాసులుగా, పనియెడల మనమెట్టి దృష్టికోణాన్ని కలిగియుండాలి? దేవుడు మనకు అనుగ్రహించిన పని, ఉద్యోగము మరియు వృత్తి పట్ల మనము ఎట్టి దృష్టిని కలిగియుండాలి? ప్రతి విశ్వాసికి ప్రాముఖ్యమని తలచే మూడు దృష్టి కోణాల్ని నేను ఇచ్చట తెలియజేస్తున్నాను.

## పని ఒక వాహనం వంటిది:

భూమిపై దేవుని ఉద్దేశ్యాలు నెరవేరబడుటకు మన పని, వృత్తి లేక ఉద్యోగము ఒక వాహనం వంటిది. పని ఒక వాహనం, దీని ద్వారా దేవుని ఉద్దేశ్యాలు భూమిపై విడుదల చేయబడతాయి. వేరొక మాటలో చెప్పాలంటే, ఒకని జీవితము పట్ల నున్న దేవుని ఉద్దేశాన్ని మరియు చిత్తాన్ని నెరవేర్చుటకు దేవుడు అనుగ్రహించిన పని ఒక సాధనముగా ఉపయోగపడుతుంది. కొంతమంది సంపూర్ణకాల సేవ కొరకు పిలువబడ్డారని నేను అర్థం చేసుకొనగలను. అయితే, సంపూర్ణకాల పరిచర్య కూడా ఒక విధంగా 'పనియే'.

## పని ఒక ప్రణాళిక:

దేవుని చిత్తాన్ని మరియు ఉద్దేశమును నెరవేర్చు సామర్థ్యతను మనకు కలుగజేయుటకై దేవుని ప్రణాళికలో పని ఒక భాగమై యున్నదని మనము గ్రహించి దానిని అట్టి రీతిగా చూచుటను ప్రారంభించాలి. ఉదాహరణకు, ఒక విశ్వాసిగా అనేకమందిని ప్రభువు కొరకు సంపాదించాలనే గొప్ప ఉద్వేగభరితమైన కోరికను నీవు కలిగియుండవచ్చు. నీ పని, నీ వృత్తి అనేకులతో నీకు సంబంధాన్ని ఏర్పాటు చేస్తుంది, వేరే రీతిగా నీవు వారిని కలుసుకొనుట సాధ్యపడకపోవచ్చు. నీవిప్పుడు నీ పని లేదా ఉద్యోగాన్ని దైవిక ప్రణాళికగా పరిగణించాలి. నీవు ఎవరికి క్రీస్తును ప్రకటించాలని దేవుడు కోరుచున్నాడో అట్టి వారితో నీకు సంబంధము ఏర్పరచుటకుగాను దేవుడు నీ పనిని వ్యూహాత్మకముగా వినియోగించుచున్నాడు. నీ ఉద్యోగమే నీ 'ప్రసంగ వేదిక', నీవు సంబంధము కలిగియుండే ప్రజలే నీ 'సంఘము'

## పని ఒక సంసిద్ధపరిచే ప్రక్రియ:

పని కేవలం డబ్బులు సంపాదించే స్థలము మాత్రమే కాదు గాని అది దేవుడు మన గుణశీలాన్ని కట్టే స్థలము కూడా. మన సిద్ధపాటు ప్రక్రియలో ఇదొక

భాగమైయుంది. సండేస్కూల్, చర్చి మరియు బైబిల్ స్కూల్‌లో మాత్రమే గుణశీలము కట్టబడుతుందని మనం తరచూ ఆలోచిస్తుంటాం, కాని దేవుడు మన గుణశీలాన్ని ఎక్కడైనా కట్టగలడు. ఆయన మన జీవితాలలో రోజుకు 24 గంటలు పని చేస్తాడు.

మనము పనిచేసే స్థలంలో, మనం ఇతరులతో సంబంధాన్ని ఏలా కలిగియుండాలి, వివిధ పరిస్థితులలో ఏలా స్పందించాలి, దైవిక జ్ఞానంపై ఆధారపడి సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే వాటిని దేవుడు మనకు బోధిస్తాడు. మనం పనిచేసే స్థలంలో ఎవరితో మనము సఖ్యముగా ఉండలేమో అట్టి వారిని మన శరీరంలోని ముల్లులుగా భావిస్తాము. కాని దేవుడు మనం పనిచేసే స్థలములోనే అక్కడే వారి మద్యే మన గుణశీలాన్ని అభివృద్ధి చేయగలడు. మరియు దేవుడు తన రాజ్య విస్తరణ కొరకు వినియోగించుకొనే, క్రొత్త నైపుణ్యతలను నేర్చుకొనుటకు మరియు మన సామర్థ్యములను అభివృద్ధి చేసుకొనుటకు మనం పనిచేసే స్థలాలలో మనకు అవకాశము దొరకవచ్చు. ఉదాహరణకు, నీ పనిలో నీవు కొన్ని నాయకత్వపు లక్షణాలను నేర్చుకొని యుండవచ్చు, దేవుడు అవే నాయకత్వపు లక్షణాలను స్థానిక సంఘ పరిచర్యలో ఒక పరిధిలో వాడుకొనవచ్చును, ఆ విధముగా అవి నిన్ను ఒక ఆశీర్వాదకరమైన వ్యక్తిగా చేస్తాయి.

<u>బైబిల్‌లోని కొంతమంది విషయమై ఆలోచిద్దాం.</u>

# యోసేపు

## "ప్రవచనాత్మకమైన కల మరియు ప్రణాళికను నెరవేర్చుట"

యోసేపు గూర్చి ఆలోచిస్తే, అతడు దైవానుగ్రహమైన ఒక దర్శనాన్ని, దైవానుగ్రహమైన కలను కలిగియుండెను. అంతమాత్రమున తన పనినంతటిని విడిచిపెట్టి సంపూర్ణకాల పరిచర్యలోనికి సాగిపోలేదు. దేవుని సంసిద్ధపరిచే ప్రక్రియగుండా యోసేపు ప్రయాణించాడు. ఆ ప్రక్రియలో అతడు పోతీఫరు గృహములో బలవంతముగా పనిచేయాల్సి వచ్చింది. అక్కడ ఏ పని చెపితే అతడు ఆ పని చేయాల్సి వచ్చింది. అక్కడ నుండి తాను చేయని తప్పుకు అతడు చెఱసాలలో వేయబడ్డాడు, అక్కడ కూడా అతడు పనిచేయాల్సి వచ్చింది. ఇతర ఖైదీలందరిపై అతడు బాధ్యత గల్గిన వ్యక్తిగా ఉంచబడ్డాడు. అంతట అతడు ఐగుప్తు దేశ ప్రధానమంత్రిగా హెచ్చించబడ్డాడు, అయితే అతడు ఇక్కడ కూడా పనిచేయాలి. అతడు సంపూర్ణకాల పరిచర్యకు పిలువబడలేదు గాని దేవుడు తన దైవిక ఉద్దేశాలు విడుదలచేయు నిమిత్తం

దేవుడు అతనిని ఒక స్థానంలో మరియు ఒక అధికార స్థితిలో ఉంచాడు. యోసేపు ఐగుప్తు దేశ ప్రధానమంత్రిగా పనిచేసాడు మరియు యోసేపుకు పిన్న వయస్సులో దేవుడిచ్చిన కలను నెరవేర్చుటకు దేవుడు అతని ప్రధానమంత్రి పదవిని వినియోగించాడు. ఒకవేళ యోసేపు ప్రధానమంత్రి పదవిని విడిచిపెట్టి, ఉద్యోగ విరామము తీసుకొని ఒక సన్యాసిగా మారిపోయి అడవులు పట్టియుంటే, బహుశా దేవుడు అతనికిచ్చిన కల నెరవేర్పును చూడలేకపోయేవాడు.

ఈ వాస్తవాన్ని ఆలోచించండి. యోసేపు కంటే చాలా సంవత్సరాల క్రితం దేవుడు అబ్రహాముతో — నీ సంతానాన్ని తామెరుగని అన్య దేశములోనికి తోడుకొని పోయెదనని చెప్పాడు. అంతట ఆయన అబ్రాముకు ఇలా చెప్పెను “ఆయన — నీ సంతతివారు తమది కాని పరదేశమందు నివసించి ఆ దేశపువారికి దాసులుగా నుందురు. వారు నాలుగువందల యేండ్లు వీరిని శ్రమ పెట్టుదురు; వీరు ఎవరికి దాసులవుదురో ఆ జనమునకు నేనే తీర్పు తీర్చుదును. తరువాత వారు మిక్కిలి ఆస్తితో బయలుదేరి వచ్చెదరు” (ఆది. 15:13,14). యోసేపుకు దేవుడిచ్చిన తలాంతులు మరియు వృత్తిపరమైన పదవిని ఆయన ఒక వాహనం వలె వినియోగించి ఈ ప్రవచనాత్మకమైన ప్రణాళికను అతడు నెరవేర్చగల్గునట్లు అతనిని ఒక స్థానంలో పెట్టాడు.

మనలో చాలామంది విభిన్న ప్రజలు, పట్టణాలు మరియు దేశాల యెడల దేవుని ప్రణాళికల పట్ల మెలకువత కలిగిలేరు. ఆయన ‘కైరోస్’ క్షణాలను (కైరోస్ అనేది గ్రీకు పదం. ఇది ప్రత్యేక సంఘటనలు, సదావకాశాలు, క్లిష్ట సంఘటనలు మరియు సరియైన కాలమందు జరిగెడి మార్పులను తెలియపరుస్తూ వాడబడే పదం) మరియు విభిన్న జాతులు, పట్టణాలు మరియు దేశాల కొరకు సదావకాశ ద్వారాలు తెరువబడే దైవిక ప్రవేశ సమయాలను (హింగేస్) కలిగియున్నాడు. దేవుడు ‘యోసేపుల’ కొరకు ఎదురుచూస్తున్నాడు. విభిన్న జాతులు, పట్టణాలు మరియు దేశముల కొరకైన ఆయన ప్రవచనాత్మకమైన ప్రణాళికను నెరవేర్చుటకు అట్టి వ్యక్తులను ఒక స్థితిలో ఉంచి వారి శక్తి సామర్థ్యములను మరియు ఉద్యోగ తలాంతులను ఆయన వినియోగించును.

# దావీదు, దానియేలు, పౌలు

## "లౌకిక మరియు ఆత్మీయ జీవిత సమ్మేళనం"

దావీదు ఒక కీర్తనకారుడు, ఒక ప్రవక్త మరియు ఒక రాజు. దానియేలు కేవలం ఒక ప్రవక్తగా మాత్రమే కాక ప్రభుత్వాన్ని నడిపే ప్రధానమంత్రిగా ఉంటూ రాజుగారి పాలనా వ్యవస్థలో శ్రద్ధ కలిగియుండెను. పౌలు గూర్చి ఆలోచించండి. మనమతనిని ఒక గొప్ప అపోస్తులునిగాను మరియు నూతన నిబంధనలోని అధిక భాగాన్ని రచించిన వ్యక్తిగా ఎరుగుదుము. పౌలు వెళ్ళిన ఇంచుమించు మూడు పట్టణాల్లో — ఎఫెసు, కొరింథీ మరియు థెస్సలోనికయ పట్టణాల్లో తన అవసరతలు మరియు పరిచర్య సభ్యుల యొక్క అవసరతలు తీర్చబడు నిమిత్తం అతడు పనిచేసినట్లు తగిన సాక్ష్యాధారాలు కలవు. తాను పరిచర్య చేసే వారికి భారముగా ఉండక తన స్వహస్తములతో పనిచేస్తూ తన అవసరతలు తీర్చుకొనెను.

దావీదు, దానియేలు మరియు పౌలు జీవితాలలో 'లౌకిక' మరియు 'ఆత్మీయ' జీవిత కలయికను —సమ్మేళనాన్ని మనం చూస్తాము. పనిని లౌకికమైనదిగాను మరియు దేవునితో నడచుట ఆత్మీయమైనదిగాను, పనితో దీనికి సంబంధము లేదన్నట్లు రెండింటినీ వేరువేరుగా చూడని అవగాహన స్థితిలోని మనము తప్పక రావాలి. నీవు చేసే పనిని దేవునితో నడిచే నీ జీవితంలోని ఒక భాగముగా గుర్తించు. ఇది నీ జీవితం కొరకైన దేవుని ప్రణాళికలోని ఒక భాగమై యున్నది. దావీదు, దానియేలు మరియు పౌలు పనిచేసినంత మాత్రాన్న వారు అభిషేకాన్ని కొల్పోలేదు! నీ పని కూడా 'ఆత్మీయమైనదే' ఎందుకంటే దేవుడు పనిచేస్తున్నాడు.

**పనిని గూర్చిన ఓ బైబిల్ పరమైన దృష్టికోణం**

**పని ఒక వాహనం**

**పని ఒక ప్రణాళిక**

**పని ఒక సంసిద్ధపరిచే ప్రక్రియ.**

# 4

# విశ్వాసులు పనిచేయ వలెనని ఆజ్ఞాపించబడ్డారు

క్రొత్త నిబంధనలో, సర్వలోకమునకు వెళ్ళి సువార్త ప్రకటించాలనే గొప్ప పనిని ప్రభువైన యేసు విశ్వాసులకు అప్పగించాడు. రక్షింపబడిన ప్రతి వ్యక్తిని వారివారి 'లౌకిక' ప్రమేయాలన్నింటినీ విడిచిపెట్టి కేవలం సువార్త ప్రకటించుటకు వెళ్ళాలనే ఆలోచనా ధోరణిలోనే నూతన నిబంధన సంఘం సాగిపోయి యుండెడిది, కాని ఈ విషయమై అపోస్తలుడైన పౌలు విశ్వాసులకు ఇచ్చిన సూచనలు గమనార్హమైనవి మరియు ఎంతో ఆసక్తికరమైనవి.

## మీ స్వహస్తములతో పనిచేయుడి :

**"...దొంగిలువాడు ఇకమీదట దొంగిలక అక్కరగల వానికి పంచిపెట్టుటకు వీలు కలుగు నిమిత్తము తన చేతులతో మంచి పనిచేయుచు కష్టపడవలెను"(ఎఫెసీ 4:28).**

దొంగతనము చేయువాడు ఇకమీదట దొంగతనం చేయక తన స్వహస్తములతో పనిచేయవలెను. అతడు తన అవసరతలు తీర్చుకొనుటకు మరియు ఇతరుల అవసరతలకు ఇచ్చునట్లుగా తన స్వహస్తములతో కష్టపడాలి, మంచిది మరియు న్యాయమైన పని చేయాలి. తమ స్వహస్తములతో పని చేయుటలోని ప్రాముఖ్యతను మరియు విలువను పౌలు విశ్వాసులకు ఇచ్చుట నేర్పిస్తున్నాడు. మంచి పనిని మాత్రమే మనము చేయాలని కూడా అతడు సూచించాడు. దీని అర్థమేమనగా నిజాయితి లేని లేక అక్రమముతో కూడిన పనులలో విశ్వాసులు పాలివారుగా ఉండకూడదు.

## మీకేమి కొదువ లేకుండునట్లు పనిచేయుడి:

**"సహోదరులారా, మీరు ప్రేమయందు మరి ఎక్కువగా అభివృద్ధి నొందుచుండ వలెననియు, సంఘమునకు వెలుపటి వారి యెడల మర్యాదగా నడుచుకొనుచు, మీకేమియు కొదువ లేకుండునట్లు మేము మీకు ఆజ్ఞాపించిన ప్రకారము మీరు పరుల జోలికి పోక, మీ సొంతకార్యములను జరుపుకొనుట యందును మీ చేతులతో పనిచేయుట యందును ఆశకలిగి యుండెవలెననియు, మిమ్మును హెచ్చరించు చున్నాను. (1థెస్స 4:11,12)**

విశ్వాసులు తమ స్వహస్తాలతో పనిచేయవలెనని పౌలు చెప్పాడు. ఎందుకనగా అవిశ్వాసులు విశ్వాసుల ప్రవర్తనలో ఎటువంటి లోపాన్ని కనుగొని నిందారోపణ చేసే అవకాశము వారికి దొరకకూడదు. మన స్వహస్తములతో పనిచేయుట అనునది మనకు ఏమి కొదువ కాకుండునట్లు లేదా మన అవసరతలన్నీ తీర్చబడుట అనుదానితో

సంబంధము కలిగియున్నదనే వేరొక విషయాన్ని గమనించాలి.

కొంతమంది ఇంటి దగ్గర ఉండి తమ అవసరతలన్నీ తీర్చబడు నిమిత్తం 'దేవునిపై వేచియుంటున్నారు'. క్రీస్తుయేసు నందు మహిమలో మన ప్రతీ అవసరతను తీర్చునని దేవుడు వాగ్దానం చేసిన మాట సత్యమే (ఫిలిప్పీ 4:19). కాని దేవుని వాక్యమందలి ఈ విషయము కూడా సత్యమే—పని చేయమని దేవుడు మనల్ని ఆజ్ఞాపించాడు, ఆయన మన పనిని సాధకముగా వినియోగించి దాని ద్వారా ఆయన మన అవసరతలను తీర్చునని తెలియపరిచాడు. పని ద్వారా దేవుడు మన అవసరతలను తీర్చుటనే కార్యము, ఒక కాకి రూపాయి నోట్ల కట్టలను తెచ్చునట్టి అతీతమైన కార్యము వంటిదే! ఇది కంటికి కనిపించకపోవచ్చును కాని ఇది ఖచ్చితంగా అతీతమైన కార్యమే, ఎందుకంటే ఆ దేవుడే నీకు అనుగ్రహిస్తున్నాడు గనుక. ఒక ఉద్యోగం పొందుటకు, దానిని కాపాడుకొనుటకు, జీతం తీసుకొనుటకు మరియు నీ వృత్తిలో అభివృద్ధిని పొందుటకు గాను దేవుని కృప మరియు దేవుని అనుగ్రహం అవసరమని గుర్తుంచుకొండి.

కొంతమంది వ్యక్తులు తమ దగ్గరకు నడుచుకుంటూ వచ్చి తమ చేతుల్లో డబ్బులు పెట్టడం లేక పోస్టు ద్వారా చెక్కులు రావడం వంటి కార్యాలను 'అతీతమైన కార్యాలుగా' తలచి అట్టి రీతిగా దేవుడు వారి అవసరతలను తీర్చాలి అని కనిపెడుతుంటారు. వారు అలా జరుగకపోవడం చూసి దేవుడు వారికెందుకు అనుగ్రహించుట లేదని ఆశ్చర్యపోతుంటారు. కొన్ని సందర్భాలలో వారు ఒక ఉద్యోగం చూసుకొని కొంతకాలం దానిలో ఉండాలని దేవుడు వారిపట్ల వేచియుంటాడు. ఆ ఉద్యోగం వారి జీవిత సదుపాయము కొరకైన దేవుని మార్గం.

## మీరొక వేళ పనిచేయనట్లైతే, తినడం మానివేయండి!

**"ఏలాగు మమ్మును పోలి నడుచుకొనవలెనో మీకే తెలియును. మేము మీ మధ్యను అక్రమముగా నడుచుకొనలేదు. ఎవనియొద్దను ఉచితముగా ఆహారము పుచ్చుకొనలేదు; మేము మీలో ఎవనికిని భారముగా ఉండకూడదని ప్రయాసముతోను కష్టముతోను రాత్రింబగళ్లు పనిచేయుచు జీవనము చేసితిమి. మీరు మమ్మును పోలి నడుచుకొనవలెనని మమ్మును మేము మాదిరిగా కనుపరచుకొనుటకే యీలాగు చేసితిమి గాని, మాకు అధికారము లేదని చేయలేదు. మరియు మేము మీ యొద్ద ఉన్నప్పుడు—ఎవడైనను పనిచేయనొల్లని యెడల వాడు భోజనము చేయకూడదని మీకు ఆజ్ఞాపించితిమి గదా. మీలో కొందరు ఏ పనియు చేయక పరుల జోలికి పోవుచు, అక్రమముగా నడుచుకొనుచున్నారని వినుచున్నాము. అట్టివారు నెమ్మదిగా పనిచేయుచు, సొంతముగా సంపాదించుకొనిన ఆహారము భుజింపవలెనని మన**

**ప్రభువైన యేసుక్రీస్తు పేరట వారిని ఆజ్ఞాపూర్వకముగా హెచ్చరించుచున్నాము" (2థెస్స 3:7-12).**

ఏమి చేయకుండా ఖాళీగా ఉంటూ, ఒక క్రమము లేకుండా జీవిస్తూ మరియు ఇతరుల మీదపడి బ్రదుకుటకు బదులు నెమ్మది కలిగి పనిచేస్తూ మన స్వంత ఆహారమును భుజించవలెనని మనకు క్రొత్త నిబంధన ఆజ్ఞాపిస్తున్నది. పనిచేయుట విశ్వాసులకు క్రొత్తనిబంధన ఆజ్ఞయై యున్నది.

## నీ స్వంత గృహము వారి కొరకు సమకూర్చుట:

**"ఎవడైనను స్వకీయులను, విశేషముగా తన యింటివారిని, సంరక్షింపకపోయిన యెడల వాడు విశ్వాసత్యాగము చేసినవాడై అవిశ్వాసికన్న చెడ్డవాడై యుండును"(1తిమోతి 5:8).**

సంపూర్ణకాల పరిచర్యకు పిలువబడిన వారికి నేనొక సవాలు చేయుటకు ఇష్టపడుచున్నాను. పరిచారకులారా, మీరు మనస్సుంచవలసిన కొన్ని విషయాలు కలవు; మీరు తప్పక నెరవేర్చవలసిన కొన్ని బాధ్యతలను దేవుడు తన వాక్యమందలి మీకు తెలియపరిచాడు. వీటిలో ఒకటేమనగా నీ ఇంటివారి అవసరతలను తీర్చుట. అనేకమంది దైవజనులైన స్త్రీ, పురుషులు తొందరపాటుతనంతో వారి ఉద్యోగాలకు రాజీనామా చేసి విశ్వాసముతో జీవించెదమని ప్రకటిస్తారు. విశ్వాసము ద్వారా జీవించుటనగా ఉద్యోగాలు మానేయటం కాదు.

ఆ ఉద్యోగాన్ని కాపాడుకొనుటకు విశ్వాసం అవసరం. కొన్నిసార్లు ప్రజలు వారి ఉద్యోగాలను విడిచిపెట్టి సంపూర్ణకాల సేవలోనికి వెళతారు. అటు తరువాత వారి కుటుంబ సభ్యులకు భోజనం పెట్టలేక ఇబ్బంది పడుతుంటారు. నేనిచ్చట కొన్ని సందర్భాలలో కలిగే ఇబ్బందులు గూర్చి మాట్లాడుట లేదు, మనమందరమూ వాటి గుండా ప్రయాణిస్తాం. ఏమైనప్పటికీ, మీరు 'సంపూర్ణకాల పరిచర్యలో' ఉన్నందున మీ కుటుంబము యొక్క కనీస అవసరతలు తీర్చబడనట్లయితే రోజుల తరబడి, నెలల తరబడి ఇలాగే జరిగితే, మీ పరిచర్య మీ అవసరతలను తీర్చగలిగేంత వరకూ మీరేదైనా ఒక ఉద్యోగం చేయడం అవసరం. కాబట్టి, మీరు సంపూర్ణ కాల పరిచర్యలోనికి అడుగుపెట్టక ముందే మీ మరియు మీ ఇంటివారి యొక్క అవసరతలను తీర్చగలిగే ఆర్థిక స్థోమతను కలిగియుండుటకు జాగ్రత్తపడుము. మీ భార్యాబిడ్డలను పోషించే స్థితి మీకు లేకపోతే వివాహము చేసుకొనవద్దు. మీరు మీఇంటివారి నిమిత్తం బాధ్యత వహించాలి అనేదే మీపట్ల దేవుని అభిలాష.

# నా సాక్ష్యము

నేను బెంగుళూరులో స్కూలుకు వెళ్లే తొలి దినాల్లో పరిచర్య విషయమై నేనెంతో ఆసక్తి కలిగియుంటిని. నేను పదియవ తరగతి ముగించగానే నేను సంపూర్ణకాల పరిచర్యలోనికి వెలతానని ప్రభువుకు ప్రార్థించాను. నేను నా లౌకికమైన విద్యను కొనసాగించనని మరియు ఒక బైబిల్ కాలేజిలో సెమినరీలో చేరాలని అనుకుంటున్నానని నా తల్లిదండ్రులను బలవంతపరిచాను, అలా చేయుట ద్వారా నేను వారికి ఇబ్బంది కలుగజేసాను. అలా ఇండియాలోని బైబిల్ కాలేజీల గూర్చి సమాచారం తెలుసుకొని పూనెలో ఉన్న ఒక కాలేజికి ఒక ఉత్తరం కూడా వ్రాసాను. నేను ఇంకా చిన్నవాడినని, దానికి 12వ తరగతి కనీస అర్హతని కాలేజి వాళ్లు ఉత్తరం ద్వారా తెలిపారు. నేను అందుకున్న ఉత్తరం నన్ను నిరాశపర్చింది. ఏమైతేనేమి, ఇంకా కేవలం రెండు సంవత్సరాలు చదవాలి. ఆ కనీస అర్హత సంపాదించిన తరువాత వేదాంత కళాశాలలో చేరాలని నేను నిర్ణయించుకున్నాను. కాని ఆ రెండు సంవత్సరాలలో నాకేదో జరిగింది. నేను బెంగుళూరులో ఒక చర్చికి వెళుతుండేవాడ్ని అయితే నేనక్కడ ఒక విషయాన్ని గమనించడం ప్రారంభించాను. నేను రెండు రకాలైన గుంపులను చూసాను–ఒక గుంపు ప్రజలు చర్చిలో వివిధ పరిధులలో పరిచర్య మరియు సేవచేసేవారు మరియు వేరొక పెద్ద గుంపు ప్రజలు చర్చికి రావడం తప్ప వేరొకటేమి చేయనివారు. రెండవ గుంపులోని ప్రజలు ఎక్కువ మంది విద్యార్థులు మరియు ఉద్యోగస్థులు, వీరు తమ పనులలో అసలు విరామము లేనివారిగా తమ్మును తాము ఎంచుకొని ఏ విధమైన పరిచర్య చేయకుండా తప్పించుకునే వాళ్లు. ఎందుచేత విద్య, ఉద్యోగములోనున్న చాలామంది 'సామాన్య విశ్వాసులు' దేవుని పరిచర్యలో పాల్గొనుటలేదని నేను ఆశ్చర్యపోయాను. ఈ సమయంలో కృతనిశ్చయమనే భావన నా హృదయాన్ని గట్టిగా అలుముకుంది. ఒక వ్యక్తి సాధారణమైన జీవితాన్ని జీవిస్తూ, ఓ ఉద్యోగం మరియు ఒక వృత్తి కలిగియుంటూ కూడా దేవునిని సేవించగలడని నా జీవితం ద్వారా ప్రజలకు ప్రత్యక్షపరచాలని నేను నిశ్చయించుకున్నాను. అలా నా పన్నెండవ తరగతి ముగించే సమయానికి వేదాంత కళాశాలకు వెళ్ళాలనే కోరికను నేను కోల్పోయాను దానికి బదులు నా జీవితంలో నేనేమి చేయాలనే ఒక నూతన ఆలోచన కలిగింది.

ఇట్టి సమయంలో బెంగుళూరులో ఒక బలమైన సంఘమును స్థాపించి అక్కడనుండి ఇండియాను చేరుకొని తద్వారా ప్రపంచ దేశాలను ప్రభావితం చేయాలనే కోరికను దేవుడు నా హృదయంలో పెట్టాడు. అలా నా పన్నెండవ తరగతిని ముగించిన తరువాత నా తల్లిదండ్రులు నన్ను మణిపాల్‌లోని ఒక ఇంజనీరింగ్ కళాశాలకు పంపారు. అప్పటికే నా విద్యను భారముగా తలచుట మాని నా విద్యార్హతలన్నీ దైవిక ప్రణాళికలో

ఒక భాగమై యున్నవని గ్రహించుట ప్రారంభించాను. నా విద్యను కొనసాగించుట ద్వారా నేనిప్పుడున్న స్థానం నుండి ఎక్కువ మంది ప్రజలను దేవుని రాజ్యము కొరకు చేరుకొన గలుగుతున్నాను.

మణిపాల్ యూనివర్సిటి కేంపస్‌లో భారతదేశము నలుమూలల నుండి మరియు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుండి వచ్చిన కొన్ని వందల మంది విద్యార్థులను నేను చూసాను. నేనక్కడ విద్యను అభ్యసించుట వెనుక ఒక ఆత్మీయ ఉద్దేశమున్నదని నేను నమ్మాను. దేవుని సేవించి అక్కడే ఆత్మలను సంపాదించాలని నా హృదయం ఆశించింది. ఇంజనీరింగు కాలేజీలో నా మూడవ సంవత్సరములో అనగా 1989 జనవరిలో విద్యార్థుల సహవాసాన్ని ఏర్పాటు చేయుటకు ప్రభువు నాకు సహాయం చేసాడు, తరువాత అది ఒక స్థానిక సంఘంగా అభివృద్ధి చెంది నేటికి కొనసాగుచున్నది. నేనిక నా చదువును ఒక భారంగాను, తప్పనిసరియైన తలనొప్పిగాను లేక ఒక బంధకముగానో చూడలేదు. ఇది ఒక వాహనమని, ఓ దైవిక ప్రణాళికని మరియు భవిష్యత్ పరిచర్యకు సంసిద్ధపరిచే ఓ ప్రక్రియని నేను గ్రహించాను.

నేను ఇంజనీరింగులో బ్యాచ్‌లర్ డిగ్రీ పూర్తి చేసిన తరువాత నా చదువును కొనసాగించాలని నేను నిర్ణయించుకున్నాను. పై చదువుల కొరకు అమెరికా వెళ్ళడానికి నా తల్లిదండ్రులు సహాయం చేసారు. అమెరికాలో ఉత్తమైన మూడు విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఒహియోలోని క్లీవ్‌ల్యాండ్‌లోని యూనివర్సిటిలో ఇంజనీరింగ్ శాఖలో నాకు ప్రవేశం దొరికింది. దేవుని కృపను బట్టి నా రెండవ సెమిస్టర్‌లో 2/3 వంతు ఆర్థిక సహాయం, మూడవ సెమిస్టర్ నుండి పూర్తి ఆర్థిక సహాయం అందింది.

యూనివర్సిటిలో చదువుకుంటూ మరియు పరిశోధనలు చేస్తూ ఇండియా, ఇండోనేసియా మరియు మలేషియా నుండి వచ్చిన విద్యార్థులతో నేనొక అంతర్జాతీయ విద్యార్థుల సహవాసమును ప్రారంభించగలిగాను, ఆ తరువాత నేను న్యూజెర్సికి వెళ్ళిపోయాను, అక్కడ 200 మంది విద్యార్థులను కలిగియున్న కొరియన్ క్రిష్టియన్ ఫెలోషిప్‌తో కలిసి పరిచర్యలో పాలుపొందాను. ఈ కొరియన్ విద్యార్థులు అమితాసక్తితో ప్రార్థించడం ఎంతో ఆశ్చర్యకరమైన సంగతి. ఈ సమయంలో యూనివర్సిటి క్యాంపస్‌కు దగ్గర్లో ఉన్న ఆఫ్రికన్–అమెరికన్ సంఘంలో నేను క్రమముగా పరిచర్య చేసాను. ఒక సంవత్సరము పైకాలము ప్రతీ బుధవారం రాత్రి ఈ ఆఫ్రికన్–అమెరికన్ సంఘంలో నేను బోధించాను మరియు వారి ఆదివారపు ఆరాధనలోను మరియు అప్పుడప్పుడు జరిగే బహిరంగ సభలలోను నేను ప్రసంగించాను.

ఇండియా నుండి వచ్చిన ఆమిని (Amy) నేను వివాహము చేసుకున్న

తరువాత, నేను యూనివర్సిటి వదిలి ఒక సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా పనిచేయటం ప్రారంభించాను. ఈ సమయంలో నేను నా భార్య కలిసి వేరొక స్పానిష్ దంపతులతో పరిచర్య చేసి న్యూజెర్సిలోని న్యూ బ్రన్స్‌విక్‌లో ఒక స్పానిష్ చర్చిని స్థాపించాం. విభిన్న ప్రాంతాల నుండి వచ్చిన విభిన్న సంస్కృతులు కలిగిన ప్రజల మధ్య పనిచేయగలుగుట అనేది ఓ ఐశ్వర్యంలాంటి అనుభవం. ఇది భవిష్యత్ పరిచర్య కొరకు ఒక శిక్షణ భూమికగా ఉండెను. నేను పై చదువులకు అమెరికా వెళ్లుట ద్వారానే ఇది సాధ్యమయ్యింది.

మేము 1998లో న్యూజెర్సి నుండి చికాగోకు వెళ్ళాము. 1999లో పరిచర్య నిమిత్తమై ఇండియాకు వెళ్ళాను, మా హృదయాల్లో ఉన్న దర్శనమును బయటకు తీసుకువచ్చి కొనసాగించుటకు మరియు తిరిగి ఇండియాకు వచ్చుటకు ఇది సరియైన సమయమని నేను భావించాను. కాబట్టి 2001, జనవరిలో బెంగుళూరుకు తిరిగి చేరుకోవాలని మేము నిశ్చయించుకున్నాము. మేము చికాగో నుండి బెంగుళూరుకు వెళ్ళిపోయే విషయమై సిద్ధపడుచున్న సమయంలో, ఇండియాలో మినిస్ట్రీ చేయడానికి ఒక మార్గమును కనుగొనవలెను అనేది మా ఆలోచనలలో ఒకటి. మేము చికాగోలో ఒక చిన్న సంఘములో భాగమైయుంటిమి. మేము కలిగియున్న ఒక పెద్ద దర్శనాన్ని కార్యరూపములో పెట్టుటకు ఆ సంఘం ఖచ్చితముగా అంత పెద్ద మొత్తంలో డబ్బును మాకు ఇవ్వలేదు. నేను దేవుని సన్నిధిలో ఈ విషయమై కనిపెట్టుచుండగా, నేను ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత కూడా సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తూ కొనసాగడం దేవుని చిత్తమని నా హృదయంలో స్పష్టంగా గ్రహించాను. నా ప్రొఫెషనల్ జీవితాన్ని ఆపమని ప్రభువు నుండి నాకు ఖచ్చితమైన సూచనలు ఏమిలేవు. ప్రత్యేకంగా మేము అమెరికాలో గడిపిన ఆ చివరి సంవత్సరాలలో, ఒక కంపెనీ స్థాపించి క్రైస్తవ సిద్ధాంతాలను ఆధారంగా వ్యాపారం చేసి దేవుని రాజ్యము కొరకు ధనాన్ని సమకూర్చాలనే తీవ్రమైన కోరికను కలిగియుంటిని. నా హృదయంలోని ఈ కోరిక ఎన్నో దినముల నుండి అంతకంతకు అధికమౌతు వచ్చింది, కాని దీనిని ఎప్పుడు ఎలా చేయాలి అనేది మాత్రం తెలియలేదు.

చివరకు మేము ఇండియాకు రావల్సిన సమయం వచ్చింది. 2000 సం॥ డిశంబర్‌లో మేము దేశాన్ని చేరుకోవాలనే ఒక మహా గొప్ప దర్శనంతో అమెరికా విడిచిపెట్టాము, కాని పరిచర్యను నడిపించుటకు కావలసిన ధనాన్ని మేమెలా

పొందుకుంటాము అనే మార్గమే మాకు తెలియదు. కొంతమంది మిత్రుల ఆర్థిక సహాయంతో U.S.A.లో మేము పరిచర్య జరిగించాము, అయితే మేము పొందే ఆర్థిక సహాయం ఖచ్చితంగా మాకున్న గొప్ప దర్శనాన్ని నెరవేర్చడానికి చాలదు!

మేము బెంగుళూరు చేరుకున్న తరువాత, దేవుడు తన కృప ద్వారా 2001 జనవరిలో మేమొక సాఫ్టవేర్ సర్వీసెస్ కంపెనీని స్థాపించుటకు బలపరిచాడు. 2001 సం॥ ఫిబ్రవరిలో, నా తండ్రి గారి గృహములో మా సంఘమును చిన్నగా ఆరంభించాము. సాఫ్ట్వేర్ కంపెనీ ఆదాయంలోని దశమభాగము సంఘానికి ఇచ్చాము, ఈ ధనంతో మేము ఒక హాలును అద్దెకు తీసుకొనగలిగాం, మాకు అవసరమైన వస్తువులను కొనగలిగాము, పుస్తకాలు ముద్రించి వాటిని ఉచితంగా పంచాము, కేబుల్ T.V. లో ప్రసారాలు ఇచ్చాము మరియు ఇతర పరిచర్యలకు కూడా సహాయం చేశాం. మాకొక గొప్ప దర్శనం ఉంది. అయితే డబ్బులు లేని కారణాన్న మా చేతులు కట్టబడలేదు. మరిన్ని సాధించడానికి మా దగ్గర చాలినంత ధనం మరియు అధిక వనరులున్నాయి.

వెనుకకు తిరిగి చూస్తూ, నన్ను పరిచర్యకు సిద్ధపరచుటకు దేవుడు నా విద్యను మరియు వృత్తిని ఏలా వినియోగించెనో నేను చూడగలను. నా చదువు మరియు వృత్తి పట్ల నా సన్నిహిత నిజాయితీ ప్రభువు యొక్క పనిని ముందుకు కొనిపోవుటకు ఒక సాధకములుగా పనిచేసాయి. దేవుని చిత్తము మరియు ఉద్దేశాలు ముందుకు తీసుకొనిపోబడుటకు గాను పని ఒక వాహనమనియు మరియు ఇది దేవుని ప్రణాళికలో ఒక భాగమనియు నేను మరింతగా ఒప్పించబడ్డాను. నీవు ఎప్పుడైతే దేవుడు చేయమనిన పనిని చేస్తుంటావో అప్పుడు నీ పని నీకొక ఆటంకముగా, బంధకముగా లేక ఒక విధిలేని తలనొప్పిగా అనిపించదు. ఒకవేళ దేవుడు నిన్ను పనిచేయుటకు పిలిచినట్లైయితే, పనిని ఒక విధిలేని తలనొప్పిగానో, బంధకముగానో లేక ఆటంకముగానో తలచవద్దు. భూమిపై దేవుని రాజ్యమును విస్తరింపచేయుటకు నీ జీవితము కొరకైన దైవిక ప్రణాళికలో పని ఒక భాగమై యున్నదని దృష్టించుట ప్రారంభించు.

**విశ్వాసులు పనిచేయవలెనని ఆజ్ఞాపించబడ్డారు**

**మీ స్వహస్తములతో పనిచేయుడి**

**మీ ఇంటివారి అవసరతలను తీర్చుడి**

# 5

# ఏడు సరియైన ఆలోచనా విధానములు:

**“దాసులారా, యథార్థమైన హృదయముగలవారై భయముతోను, వణుకుతోను క్రీస్తునకువలె, శరీర విషయమై మీ యజమానులైన వారికి విధేయులై యుండుడి. మనుష్యులను సంతోషపెట్టువారు చేయునట్లు, కంటికి కనబడుటకే కాక, క్రీస్తు దాసులమని యెరిగి, దేవుని చిత్తమును మనఃపూర్వకముగా జరిగించుచు, మనుష్యులకు చేసినట్టుకాక ప్రభువునకు చేసినట్టే యిష్టపూర్వకముగా సేవచేయుడి. దాసుడైనను స్వతంత్రుడైనను మీలో ప్రతివాడును ఏ సత్కార్యము చేయునో దాని ఫలము ప్రభువు వలన పొందునని మీరెరుగుదురు. యజమానులారా, మీకును వారికిని యజమానుడైనవాడు పరలోకమందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు ఎరిగినవారై, వారిని బెదరించుట మాని, ఆ ప్రకారమే వారియెడల ప్రవర్తించుడి. తుదకు ప్రభువు యొక్క మహా శక్తిని బట్టి ఆయనయందు బలవంతులై యుండుడి” (ఎఫెసీ 6:5-10).**

**“దాసులారా, మనుష్యులను సంతోషపెట్టువారైనట్టు కంటికి కనబడవలెనని కాక, ప్రభువునకు భయపడుచు శుద్ధాంతఃకరణగలవారై, శరీరమును బట్టి మీ యజమానులైన వారికి అన్ని విషయములలో విధేయులై యుండుడి. ప్రభువువలన స్వాస్థ్యమును ప్రతిఫలముగా పొందుదుమని యెరుగుదురు గనుక, మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి; మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులై యున్నారు. అన్యాయము చేసినవానికి తాను చేసిన అన్యాయము కొలది మరల లభించును, పక్షపాతముండదు” (కొలస్సీ 3:22-25).**

పై రెండు లేఖన భాగాలు అందించే సూచనలు చాలా సన్నిహితంగా ఉన్నాయి. ఈ దినాల్లో యజమానుడు—బానిస అనే అంశాలు మనుగడలో లేవు. ఏమైనను, ‘యజమానుడ్ని’ మరియు ‘బానిసను’ మనము ‘ఉద్యోగమిచ్చేవానిగా’ మరియు ‘ఉద్యోగిగా’ అర్థం చేసుకుందాం. అప్పుడు ఇది మన నేటి మనుగడకు చెందుతుంది.

## పనికి సంబంధించిన ఏడు ఆలోచనా విధానాల్ని పౌలు కనపరచుచున్నాడు:

1. మనము ఉద్యోగస్థులుగా మనకు ఉద్యోగమిచ్చిన అధికారికి విధేయత చూపించాలని పౌలు సూచించెను. అనగా మనం మన ఆఫీసులోని నియమనిబంధనలను పాటిస్తూ వాటికి కట్టుబడియుంటామని దీని అర్థం.

2. అంతట, మనకు పని కల్పించిన అధికారి పట్ల గౌరవ మర్యాద (భయము, వణకు) లను కలిగియుండాలి. మన అధికారి కన్నా మనకు ఎక్కువ తెలుసు అనే భావన మరియు తిరుగుబాటు మనస్తత్వము కలిగియుండుటకు బదులు ఆఫీసులో మనపై అధికారుల పట్ల గౌరవము కలిగి మర్యాదగా నడచుకోవాలి.

3. పవిత్రమైన ఉద్దేశము, 'హృదయ యథార్థత' లేక 'హృదయమంతటితో' పనిచేయుటను గూర్చి పౌలు మాట్లాడుచున్నాడు. నీ పనిపట్ల నమ్మకంగా ఉండండి. 'నమ్మకం' లేక 'హృదయమంతటితో' అనే పదాలు గ్రీకు శబ్దం నుండి వెలువడినవి. వీటి అర్థం 'కపటము లేకుండా లేక స్వార్థము లేకుండా' పనిచేయుట అని కూడా అర్థమిచ్చుచున్నది. మరియు ఇది "దాతృత్వముతో, సమృద్ధియైన రీతిలో, స్వేచ్ఛగా, సరళతతో" అనే అర్థాన్ని కూడా ఇచ్చుచున్నది.

4. పౌలు మనస్సాక్షి విషయమై, అనగా ఎవరూ గమనించక పోయినప్పటికీ బాధ్యతాయుతంగా ఉండుటను గూర్చి మాట్లాడుచున్నాడు. అతడింకా ఇలా చెప్పుచున్నాడు, "కంటికి కనబడవలెనని కాక, మనుష్యులను సంతోషపెట్టువారైనట్టు కాక". మనము 'క్రీస్తు యొక్క ఉద్యోగులు' అనే వాస్తవమే దీని వెనుక గల ప్రేరణ. మనము గమనించవలసిన ముఖ్య విషయమేమనగా, మనము పనిచేయుచున్న కంపెనీ, సంస్థ లేక ఇంకేదైనా ఆఫీసులో మనము ఉద్యోగస్థులము కాక మునుపే మనము 'క్రీస్తు యొక్క ఉద్యోగస్థులమనే' వాస్తవికతను గ్రహించాలి. మనము పనిచేసే స్థలాలలో, మనము క్రీస్తు యొక్క ఉద్యోగస్థులుగా ఉన్నాము. మనము క్రీస్తును కనపరుస్తూ "మనుష్యులకు చేయుచున్నట్లుకాక ప్రభువు కొరకే చేయుచున్నట్లుగా" మనం పనిచేయాలి, ఎందుకనగా మనము ప్రభువు నిమిత్తమే పనిచేస్తున్నాము. మన ప్రధాన అధికారియైన క్రీస్తు మనల్ని గమనిస్తున్నాడు. మనం సమయానికి పనికి వెళుతున్నామా లేదా అని ఆయన గమనిస్తున్నాడు. ఆయన మన యదార్థతను, హాజరును మరియు పనికి రాకపోవుటను అన్నిటినీ చూస్తున్నాడు. మనము పనిని తప్పించుకొనుటకు వెనుకనున్న నిజమైన కారణాలు కూడా ఆయనకు తెలుసు, జ్వరం పేరు చెప్పి సెలవు తీసుకొని వేరొక పనిచేయడం వంటివి కూడా ఆయనకు తెలుసు. పనిలో మన సమయాన్ని ఎలా వినియోగిస్తున్నామో దానిని ఆయన చూస్తున్నాడు. మనము సరిగ్గా పనిచేస్తున్నామా లేక సమయాన్ని వృథా చేస్తున్నామా? మనము ప్రయత్నించే వంకర మార్గాలన్నింటినీ (షార్ట్‌కట్స్) ఆయన చూస్తున్నాడు. మనము తప్పుడు లెక్కలు, యదార్థత లేని సమాచారాన్ని తయారుచేయు చున్నట్లయితే ఆయన వాటన్నింటిని చూస్తున్నాడు.

5. మనం చేసే పనిని "ప్రభువు కొరకై హృదయపూర్వకముగా చేయుచున్నట్లు" లేక "హృదయంలో నుండి దేవుని చిత్తాన్ని జరిగించుచున్నట్లు" చేయాలని పౌలు మాట్లాడుచున్నాడు. మనకు అప్పగింపబడిన పనిని హృదయపూర్వకంగా చేయాలి. హృదయ పూర్వకముగా కాక అర్థహృదయంతో పనిచేయ ప్రయత్నించవద్దు. దానికి బదులు మీరు కలిగియున్న దానినంతటిని మీ పని కొరకు వెచ్చించండి. మీకు సాధ్యమైనంత శక్తి మేరకు పనిచేయండి. మీరు దీనిని యేసు కొరకు చేయుచున్నట్లు చేయండి.

6. అంతట పౌలు "మనస్ఫూర్తిగా సేవాదృక్పథంతో పనిచేయమని" మనకు సూచిస్తున్నాడు. మీరు మీ పనిని సణుగులు మరియు పిర్యాదులతో కాక సంతోషముతో చేయండి. మెసేజ్ బైబిల్ దీనిని ఈ విధంగా తెలియజేస్తుంది: "మీ ముఖముపై చిరునవ్వుతో పనిచేయండి, మీకు ఎవరు ఆజ్ఞాపిస్తున్నారు అనే అంశమును లక్ష్యపెట్టక మీరు 'నిజముగా దేవుని సేవించుచున్నారనే' గ్రహింపును ఎల్లప్పుడు మీ మనస్సులో కలిగియుండండి".

7. చివరగా, పౌలు ఇలా చెప్పుచున్నాడు – 'మీ బహుమానము కొరకు ప్రభువు వైపు చూడుము'. క్రీస్తే మీకు పని కల్పించెను, గనుక మీరు మీ శక్తి మేరకు ఉత్తమమైన దానిని జరిగించి నిర్భయంగా విశ్రమించండి, ఎందుకంటే మీకు బహుమాన మిచ్చుటకు ఆయన నమ్మదగినవాడు. మీ బహుమానము కొరకు మీరు ప్రభువు వైపు చూస్తున్నప్పుడు లోకస్థుల వలె ప్రవర్తింపవద్దు. లోకములోని ప్రజలు వారి ఆఫీసులలో అభ్యున్నతి సాధించుటకు ఇతరులను "ప్రక్కను నెట్టి క్రిందికి లాగే" ప్రయత్నాలు చేస్తుంటారు. కాని విశ్వాసులుగా ప్రశాంతంగా, నెమ్మది కలిగి మన పనిని హృదయపూర్వకంగా చేస్తూ మన శక్తి మేరకు శ్రమించాలి. పరలోకమందున్న దేవుడు మనకు బహుమానమిస్తాడు. మన ఆఫీసులో మనకు ఉన్నత పదవి ఇవ్వాలని ప్రభువు నిర్ణయించినప్పుడు ఏ మనిషీ దానికి అడ్డు రాలేడు! మరియు మీరు గుర్తుంచుకొనవలసినది ఏమనగా ఆ బహుమాన భాగము అనేది మీకు రాబోయే లోకంలో కూడా ఉంటుంది. మరోవైపు మీ స్వాస్థ్యములోనికి మీరు వచ్చినపుడు మీకు రావలసిన జీతం మొత్తాన్ని మీరు పొందుతారు!

బహుశా మెసేజ్ బైబిల్ తర్జుమాలోని కొలస్సీ 3:22-25 వచనాలు ఈ అంశాలను మరింత స్పష్టపరచి సరళతతో తేటపరుస్తాయి.

**"దాసులారా, మీ లోక యజమానులు మీకు చెప్పిన పనిని చేయుడి. మరియు తగిన దానికన్నా తక్కువగా చేయవద్దు. మీ శక్తి మేరకు ఉత్తమమైన దానిని చేయండి. మీ**

**నిజ యజమానియైన దేవుని కొరకు యథార్థమైన హృదయంలో పనిచేయండి. మీరు మీ స్వాస్థ్యములోనికి వచ్చినప్పుడు మీ జీతాన్ని పూర్తిగా పొందుకుంటారని నిశ్చయత కలిగియుండుడి. తుదకు మీరు అసలైన యజమాని అయిన క్రీస్తును సేవించుచున్నారని ఎల్లవేళలా మనస్సులో జ్ఞాపకముంచుకొనుడి. చిరాకుతో పనిచేసేవానిని తాను చేసే అధర్మమే అతనిని బాధ్యుడ్ని చేస్తుంది. క్రైస్తవుడిగా ఉండినంత మాత్రాన్న మీ నాణ్యతలేని చౌకబారు పనితనం కప్పివేయబడదు".**

## సంపూర్ణకాల పరిచారకులకు ఒక మాట:

ఒకసారి బెంగుళూరులోని ఒక పాస్టర్, ఆఫీసులో మీరెన్ని గంటలు పనిచేస్తారని నన్ను అడిగారు. నేను సాదారణంగా వారములోని పని దినాలలో పనిచేస్తానని, ఇంచుమించు 40 నుండి 50 గంటలు పనిచేస్తానని చెప్పాను. అతడు ఆశ్చర్యపోయి నేనొక సంపూర్ణకాల పరిచారకునిగా రోజుకు 4 గంటలు కూడా పనిచేయుట లేదని ఒప్పుకున్నాడు.

లౌకిక ఉద్యోగములో ఉన్నవారి వలె సంపూర్ణకాల పరిచర్యలో ఉన్న పాస్టర్స్, సువార్తికులు మరియు ఇతర పరిచారకులు—అటువంటి క్రమశిక్షణను మరియు పనిలోని నీతి నియమాలను తప్పక పాటించాలని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను. మీరు పరిచర్య పనిని రోజుకు కనీసం ఎనిమిది గంటలు, ఒక వారానికి 40 గంటలు పని చేయాలి! మీరు మంచి పని అలవాట్లు కలిగియుండుటకు క్రమశిక్షణ కలిగియుండాలి.

**పని యెడల సరియైన ఆలోచనా విధానములు**

**విధేయత, గౌరవం, సరియైన ఉద్దేశాలు, నిజాయితీ, హృదయపూర్వక ప్రయత్నం, సంతోషం, దైవిక బహుమానాలు.**

# 6

# మీ పనిని గూర్చిన వాగ్దానాలు

లేఖనాలలో పనిని గూర్చిన అనేక వాగ్దానాలున్నాయి. మనము చేసే పనికి ప్రభువు మనకు బహుమానమిచ్చునని గత అధ్యాయములో చూసాము. బహుమానములోని కొంతభాగం ప్రస్తుతం ఈ భూమిపైన మరికొంత భాగం మనము ప్రభువును కలుసుకున్నప్పుడు మనకు ఇవ్వబడుతుంది. మనమిక్కడ ఈ లోకంలో యుండగానే పొందుకొనగలిగే కొన్ని వాగ్దానాలు ఇక్కడ ఉన్నాయి.

## మీ చేతి పనులపై ఆశీర్వాదము:

**"నీ కొట్లలోను నీవు చేయు ప్రయత్నము లన్నిటిలోను నీకు దీవెన కలుగునట్లు యెహోవా ఆజ్ఞాపించును. నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న దేశములో ఆయన నిన్ను ఆశీర్వదించును" (ద్వితియో 28:8).**

**"యెహోవా నీ దేశముమీద వర్షము దాని కాలమందు కురిపించుటకును నీవు చేయు కార్యమంతటిని ఆశీర్వదించుటకును, ఆకాశమను తన మంచి ధననిధిని తెరచును. నీవు అనేక జనములకు అప్పిచ్చెదవు కాని అప్పు చేయవు" (ద్వితియో 28:12).**

ఇవి పాత నిబంధనలో దేవుని ప్రజలకు ఇవ్వబడిన వాగ్దానాలు. పాతనిబంధన యొక్క ఆ దేవుడే క్రొత్త నిబంధనకు దేవుడై యున్నాడు. నిబంధనలు మార్పు చెందాయి, కాని నిబంధనా దేవుడు, తన ప్రజలను ఆశీర్వదించాలనే ఆయన హృదయము మరియు ఆశీర్వదించే సామర్థ్యము మార్పుచెందలేదు. కాబట్టి నిస్సందేహముగా మనము చేతులుంచు వాటన్నింటిని మన దేవుడు ఆశీర్వదించునట్లు ఆశించవచ్చు. దేవుడు మిమ్మల్ని మీ ఉద్యోగంలో ఆశీర్వదించునట్లు ఆశించండి. మీరు మీ ఆఫీసుకు వెళ్ళే ప్రతిరోజు దేవుని ఆశీర్వాదము మీపై ఉండాలని ఆశించండి!

## ఉన్నత పదవి ప్రభువు నుండి వస్తుంది:

**"...నీవు అనుసరించి నడుచుకొనవలెనని నేడు నేను నీకాజ్ఞాపించుచున్న నీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను విని వాటిని అనుసరించి గైకొనిన యెడల, యెహోవా నిన్ను తలగా నియమించును గాని తోకగా నియమింపడు. నీవు పైవాడవుగా ఉందువు గాని క్రిందివాడవుగా ఉండవు" (ద్వితి. 28:14).**

**“తూర్పు నుండియైనను, పడమటి నుండియైనను, అరణ్యము నుండియైనను హెచ్చు కలుగదు. దేవుడే తీర్పు తీర్చువాడు. ఆయన ఒకని తగ్గించును ఒకని హెచ్చించును” (కీర్తన 75:6,7).**

దేవుడు మీ పక్షాన్న ఉన్నాడు. మీరు హెచ్చించబడుటకు మార్గము కలుగజేయువాడు దేవుడే. మీరు పనిలో చూపే శ్రద్ధను దేవుడు చూసి మీరు హెచ్చించబడుటకు ఆయన మార్గము తెరచును. మీ తోటి ఉద్యోగులను ‘ప్రక్కకు నెట్టి వెనక్కిలాగి’, “వారిని అణగద్రొక్కి” లేక నీ అధికారులకు లంచాలివ్వ వలసిన పనిలేదు. కేవలం శ్రద్ధతో పనిచేసి, ఉత్తమమైన దాన్ని జరిగించి మీ పదోన్నతికై ప్రభువు మార్గమును సిద్ధపరచునట్లు ఎదురుచూడండి. నేను చికాగోలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసినప్పుడు నేనెంతో కలతచెందిన సంగతి నాకు జ్ఞాపకమే. “దేవా నా సామర్థ్యము మేరకు నేను వినియోగపడుట లేదు నాకు పదోన్నతి దయచేయుమని ప్రార్థించే వానిని. నేను ఇంకా ఎక్కువ బాధ్యతలను చేపట్టి మరియు కొంతమంది టీమ్ సభ్యులను కూడా నడిపించగలను అని నేను అనుకొనేవాడ్ని”. దేవుని వాక్య ప్రకారం, పదోన్నతి ప్రభువు నుండి కలుగుతుందని నేను విశ్వసించాను. అతి త్వరలోనే నా పరిస్థితులు మారిపోయాయి నా మేనేజర్ నన్ను ఒక టీమ్‌పై అధికారిగా నియమించి నన్ను ఆ టీమ్‌కు నాయకుడిగా చేశాడు. ప్రభువు నుండి పదోన్నతి లభించింది!

## మీ పని ద్వారా కలిగే ప్రతిఫలాన్ని ఆనందించండి:

**“మరియు ప్రతివాడు అన్నపానములు పుచ్చుకొనుచు తన కష్టార్జితము వలన సుఖమనుభవించుట దేవుడిచ్చు బహుమానమే అని తెలిసికొంటిని” (ప్రసంగి 3:13).**

**“యెహోవా యందు భయభక్తులు కలిగి ఆయన త్రోవలయందు నడుచువారందరు ధన్యులు. నిశ్చయముగా నీవు నీ చేతుల కష్టార్జితము ననుభవించెదవు. నీవు ధన్యుడవు నీకు మేలు కలుగును. (కీర్తన 128:1,2).**

**“మరియు కోరదగినదిగాను చూడ ముచ్చటయైనదిగాను నాకు కనబడినది ఏదనగా, దేవుడు తనకు నియమించిన ఆయుష్కాల దినములన్నియు ఒకడు అన్నపానములు పుచ్చుకొనుచు తన కష్టార్జితమంతటి వలన క్షేమముగా బ్రదుకుచుండుటయే, ఇదియే వానికి భాగ్యము. మరియు దేవుడు ఒకనికి ధనధాన్య సమృద్ధి ఇచ్చి దానియందు తన భాగము అనుభవించుటకును, అన్నపానములు పుచ్చుకొనుటకును, తన కష్టార్జితమందు సంతోషించుటకును వీలు కలుగజేసిన యెడల అతనికి ఆ స్థితి దేవుని ఆశీర్వాదము వలన కలిగినదనుకొనవలెను”(ప్రసంగి 5:18,19).**

మీ పనిలో సంతోషించగలిగే సామర్థ్యము—మీ శ్రమ ఫలితాన్ని ఆనందించ గలుగుట — అది దేవుని నుండి కలిగే దీవెన మరియు బహుమానము. మీ శ్రమ ఫలితాన్ని బట్టి మీరు నిజముగా ఆనందించగలరని దేవునిని నమ్మండి. కష్టించి పనిచేసే వాళ్లు ఎందరో ఉన్నారు. కాని వారు తమ పని ద్వారా సంపాదించేదంతా గాలికి కొట్టుకొని పోయినట్లు కనబడుతుంది. వారి జీతం కన్నాలున్న సంచిలో వేసినట్లు కనిపిస్తుంది. ఇతరులు ఎంతో ధనాన్ని కలిగియున్నారు కాని సంతోషాన్ని మరియు శాంతిని కలిగిలేరు. అధిక ధనము కలిగియుంటూ కూడా అసంతృప్తి, గొడవలు మరియు కొరత కలిగియున్నారు. అయితే మీ విషయంలో ఇట్టి రీతిగా ఉండకూడదు. మీ శ్రమ ఫలితం ద్వారా మీరు 'తిని', 'ఆనందించి' మరియు సంతోషిస్తారని దేవునిని నమ్మండి.

**మీ పనిని గూర్చిన వాగ్దానాలు**

**మీ చేతి పనులపై ఆశీర్వాదం**

**ప్రభువు నుండి పదోన్నతి కలుగుతుంది.**

**మీ శ్రమ ఫలితాన్ని ఆనందించండి.**

# 7

# నూతన రాజ్యములో పనిచేయుట

"ఇదిగో నేను క్రొత్త ఆకాశమును, క్రొత్త భూమిని సృజించుచున్నాను. మునుపటివి మరువబడును జ్ఞాపకమునకు రావు. నేను సృజించుచున్న దానిగూర్చి మీరు ఎల్లప్పుడు హర్షించి ఆనందించుడి. నిశ్చయముగా నేను యెరూషలేమును ఆనందకరమైన స్థలముగాను, ఆమె ప్రజలను హర్షించువారినిగాను సృజించుచున్నాను. నేను యెరూషలేమును గూర్చి ఆనందించెదను. నా జనులను గూర్చి హర్షించెదను. రోదనధ్వనియు విలాపధ్వనియు దానిలో ఇకను వినబడవు. అక్కడ ఇకను కొద్దిదినములే బ్రదుకు శిశువులుండరు. కాలమునిండని ముసలివారుండరు. బాలురు నూరు సంవత్సరముల వయస్సుగలవారై చనిపోవుదురు. పాపాత్ముడై శాపగ్రస్తుడగువాడు సహితము నూరు సంవత్సరములు బ్రదుకును. జనులు ఇండ్లు కట్టుకొని వాటిలో కాపురముందురు. ద్రాక్షతోటలు నాటించుకొని వాటి ఫలముల ననుభవింతురు. వారు కట్టుకొన్న యిండ్లలో వేరొకరు కాపురముండరు. వారు నాటుకొన్నవాటిని వేరొకరు అనుభవింపరు. నా జనుల ఆయుష్యము వృక్షాయుష్యమంత యగును నేను ఏర్పరచుకొనినవారు తాము చేసికొనినదాని ఫలమును పూర్తిగా అనుభవింతురు. వారు వృథాగా ప్రయాసపడరు. ఆకస్మికముగా కలుగు అపాయము నొందుటకై పిల్లలను కనరు. వారు యెహోవాచేత ఆశీర్వదింపబడినవారగుదురు. వారి సంతానపువారు వారియొద్దనే యుందురు. వారికీలాగున జరుగును. వారు వేడుకొనకమునుపు నేను ఉత్తరమిచ్చెదను. వారు మనవి చేయుచుండగా నేను ఆలకించెదను. తోడేళ్లును గొఱ్ఱెపిల్లలును కలిసి మేయును, సింహము ఎద్దువలె గడ్డి తినును, సర్పమునకు మన్ను ఆహారమగును. నా పరిశుద్ధ పర్వతములో అవి హానియైనను నాశనమైనను చేయకుండును అని యెహోవా సెలవిచ్చుచున్నాడు" **(యెషయా 65:17-25).**

"రాత్రి కలిగిన దర్శనములను నేనింక చూచుచుండగా, ఆకాశమేఘారూఢుడై మనుష్యకుమారుని పోలిన యొకడు వచ్చి, ఆ మహావృద్ధుడగువాని సన్నిధిని ప్రవేశించి, ఆయన సముఖమునకు తేబడెను. సకల జనులును రాష్ట్రములును ఆయా భాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది అదెన్నటికిని తొలగిపోదు; ఆయన రాజ్యము ఎప్పుడును లయముకాదు. అయితే మహోన్నతుని పరిశుద్ధులే రాజ్యాధికారము నొందుదురు; వారు యుగయుగములు యుగయుగాంతముల వరకు రాజ్యమేలుదురు. ఆ మహావృద్ధుడు వచ్చి మహోన్నతుని పరిశుద్ధుల విషయములో తీర్పు తీర్చువరకు ఆలాగు జరుగును గాని సమయము వచ్చినప్పుడు ఆ పరిశుద్ధులు రాజ్యము నేలుదురను సంగతి నేను

**గ్రహించితిని. ఆకాశమంతటి క్రిందనున్న రాజ్యమును అధికారమును రాజ్య మహాత్మ్యమును మహోన్నతుని పరిశుద్ధులకు చెందును. ఆయన రాజ్యము నిత్యము నిలుచును, అధికారులందరును దానికి దాసులై విధేయులగుదురు. ఇంతలో సంగతి సమాప్తమాయెను అని చెప్పెను" (దానియేలు 7:13,14,18,22,27).**

**"నేను వచ్చువరకు మీకు కలిగియున్న దానిని గట్టిగా పట్టుకొనుడి. నేను నా తండ్రివలన అధికారము పొందినట్టు జయించుచు, అంతమువరకు నా క్రియలు జాగ్రత్తగా చేయువానికి జనులమీద అధికారము ఇచ్చెదను. అతడు ఇనుప దండముతో వారిని యేలును; వారు కుమ్మరవాని పాత్రలవలె పగులగొట్టబడుదురు" (ప్రకటన 2:25-27).**

పరలోకము మరియు నిత్యత్వము గూర్చి మనలో అనేకమంది వివిధ ఉద్దేశములు కలిగియున్నారు. నిత్యత్వమంతా ఓ శాశ్వతమైన విరామ సమయమని తలస్తూ అక్కడ మన పరలోక భవంతుల నుండి ఇటుఅటు మేఘాలమీద తేలుతూ వెళుతూ మరియు దూతలతో కలిసి దేవునికి స్తుతిగానాలు చేయుటయే అని కొంతమంది అనుకుంటారు. ఏమైనప్పటికీ, రాబోయే లోకములో మనము చేయవలసిన దానిని గూర్చి బైబిల్ తెలియజేస్తున్నది.

నూతన ఆకాశము మరియు భూమి కలిగిన తరువాత, దేవుని ప్రజలు ఇంకా గృహాలు కడతారని మరియు ద్రాక్షా తోటలు నాటుతారని యెషయాలోని పాఠ్యభాగం మనకు తెలియజేస్తుంది. మనము కష్టించి పనిచేసి మన చేతిపని యొక్క ఫలాన్ని ఆనందిస్తాము. కాబట్టి నూతన లోకంలో కూడా మనం పనిచేయబోతున్నాం.

భూమిపై క్రీస్తు రాజ్యము మరియు పరిపాలనా వ్యవస్థలో దేవుని ప్రజలు సహకారులుగా ఉండెదరని దానియేలు మరియు ప్రకటన గ్రంథమందలి లేఖన భాగాలు మనకు తెలుపుచున్నవి. క్రీస్తు వచ్చి తన రాజ్యమును స్థాపించినప్పుడు ఆయన ప్రభుత్వములో సహకరించుటయందు దేవుని ప్రజలు చేతినిండా పని కలిగియుంటారు.

కాబట్టి నిత్యము మనము పనిచేస్తూ ఉన్నట్లుగానే కనబడుతుంది! పనిచేయుటను ఆనందిద్దాం. ఇది దేవుడు ఏర్పాటు చేసినది, ఇది దేవుడు నియమించిన క్రియ. భూమిపై ఆయన ఉద్దేశములు ముందుకు తీసుకొనిపోబడుటకు గాను నీ పని ఒక వాహనము వలె తయారుకానిమ్ము.

**నూతన లోకంలో కూడా మనం పనిచేయబోవుచున్నాం !**

**కాబట్టి, పనిచేయుటను ఆనందిద్దాం.**

# నిన్ను ప్రేమించే దేవునిని నీవు యెరుగుదువా ?

సుమారు 2,000 సంవత్సరాల క్రితం దేవుడు మనిషిగా ఈ లోకానికి వచ్చాడు, ఆయన పేరు యేసు. ఆయన పాపములేని ఓ పరిపూర్ణ జీవితాన్ని జీవించాడు. యేసు శరీరమందున్న దేవుడుగా ఉన్నందున, ఆయన చేసిన సమస్తము మరియు చెప్పినవన్నీ మనకు దేవునిని కనుపరిచాయి. ఆయన మాట్లాడిన మాటలన్నీ దేవుని మాటలే. ఆయన చేసినవన్నీ దేవుని క్రియలే. యేసు భూమిపై ఎన్నో అద్భుతాలు చేసాడు. ఆయన రోగగ్రస్తులను మరియు బాధపడుచుండిన వారిని స్వస్థపరిచెను. గ్రుడ్డివారి కన్నులను తెరిచెను, చెవిటి వారిని స్వస్థపరిచెను, కుంటి వారిని నడిపించెను మరియు ప్రతి విధమైన రోగాన్ని, వ్యాధిని నయము చేసెను.

**ఈ క్రియలన్నీ దేవుడు – ప్రజలు క్షేమంగా, స్వస్థతతో, ఆరోగ్యకరంగా మరియు సంతోషముగా ఉండాలని కోరుకునే దేవుడని మనకు తెలియజేయుచున్నది.**

అయితే దేవుడు మనిషిగా మారి ఎందుకు ఈ లోకంలో అడుగుపెట్టెను? యేసు ఎందుకు వచ్చెను?

మనమందరము పాపము చేసాము మరియు మనల్ని సృష్టించిన దేవుని యెదుట అంగీకరింపబడని క్రియలను చేసాము. పాపము దాని ప్రతిఫలాన్ని కలిగియుంది. పాపము అనునది దేవునికి మనకు మధ్య అడ్డుగా నున్న మరియు దాటలేనటు వంటి పెద్ద గోడలాంటిది. పాపము మనల్ని దేవుని నుండి వేరు చేస్తుంది. మనల్ని సృష్టించిన దేవునిని తెలుసుకొనకుండ మరియు ఆయనతో ఒక అర్థవంతమైన సంబంధము కలిగియుండకుండ పాపము అడ్డుపడుతుంది. కాబట్టి మనలో చాలామంది ఈ శూన్యతను ఇతర వాటితో నింప ప్రయత్నిస్తారు.

మన పాపముల యొక్క వేరొక పరిణామం–దేవుని నుండి నిత్య ఎడబాటు. దేవుని న్యాయస్థానంలో పాపానికి శిక్ష మరణం. మరణం దేవుని నుండి నిత్య ఎడబాటుకు గురిచేసి నరకములోనికి కొనిపోవును.

కాని, మనము పాపము నుండి విడుదల పొంది దేవుని కొరకు సమకూర్చ బడగలము. “ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసు నందు నిత్యజీవము” (రోమా 6:23) అని బైబిల్ చెప్పుచున్నది. యేసు సిలువపై మరణించినప్పుడు ఆయన సర్వలోకము యొక్క పాపము కొరకు వెల చెల్లించెను. అంతట, మూడు రోజుల తరువాత ఆయన తిరిగి లేచెను. అనేకులకు తన్నుతాను కనపరచుకొని అటు తరువాత పరలోకానికి వెళ్ళెను.

దేవుడు ప్రేమ కనికరములు గల దేవుడు. ఏ ఒక్క వ్యక్తి నరకానికి వెళ్ళి నశించిపోవాలని ఆయన కోరుకొనడు. అందుకే ఆయన వచ్చి పాపము నుండి మరియు దాని నిరంతర పరిణామముల నుండి సమస్త మానవాళి విడుదల నొందే మార్గాన్ని అనుగ్రహించాడు. ఆయన పాపులను రక్షించుటకు వచ్చెను – పాపము నుండి మరియు

మరణము నుండి మనవంటి వారిని కాపాడుటకై వచ్చెను.

ఈ ఉచిత పాపక్షమాపణ పొందుకొనుటకై, ప్రభువైన యేసుక్రీస్తు సిలువపై చేసిన దానిని అంగీకరించి హృదయపూర్వకంగా ఆయన యందు నమ్మికయుంచ వలెనని బైబిల్ మనకు చెప్పుచున్నది.

"ఆయన యందు విశ్వాసముంచు వాడెవడో వాడు ఆయన నామము మూలముగా పాపక్షమాపణ పొందునని..." (అపో.కా. 10:43)

"యేసుప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు"(రోమా 10:9).

మీరు ప్రభువైన యేసుక్రీస్తు నందు విశ్వసించిన యెడల మీరు కూడా పాప క్షమాపణ నొంది శుద్ధులు కాగలరు.

ప్రభువైన యేసుక్రీస్తు సిలువపై చేసిన దానిని నమ్మి మరియు ఆయన యందు విశ్వాసముంచుటకు మీరు నిర్ణయము తీసుకొనుటకు సహకరించే ఓ సామాన్యమైన ప్రార్థన ఈ దిగువన ఇవ్వబడింది. మీ పాపక్షమాపణను మరియు శుద్ధీకరణను మీరు పొందుటకై యేసు ఏమి చేసెనో దానిని మీరు అంగీకరించి బయటకు తెలియజేయుటకు ఈ ప్రార్థన సహాయపడుతుంది. ఈ ప్రార్థన కేవలం సహకారము నిమిత్తమే. మీరు మీ స్వంత మాటలలో కూడా ప్రార్థించ వచ్చును.

*ప్రియ యేసుప్రభు, నీవు నా కొరకు సిలువపై చేసిన దానిని నేడు నేను గ్రహించాను. నేను క్షమించబడులాగున నీవు నా కొరకు మరణించి, నీ ప్రశస్తమైన రక్తాన్ని చిందించి మరియు నా పాప శిక్షకు వెల చెల్లించావు. నీయందు ఎవడు విశ్వసించునో వాడు తన పాపక్షమాపణ పొందునని బైబిల్ చెప్పుచున్నది.*

*సిలువపై మరణించి మరియు మరణము నుండి తిరిగి లేచుట ద్వారా నీవు నా కొరకు జరిగించిన దానిని నేడు నేను అంగీకరించుటకు మరియు నమ్ముటకు నేను నిర్ణయము తీసుకొనుచున్నాను. వేరొక ఏ మనిషి గాని లేక నా మంచిక్రియలు గాని నన్ను రక్షింపలేవని నేనెరుగుదును. నా పాపములకు క్షమాపణను నేను ఇంకే విధముగాను సంపాదించలేను.*

*నీవు నా కొరకు మరణించావని, నా పాపముల కొరకు వెల చెల్లించావని, మరణము నుండి తిరిగి లేచావని నేడు నా హృదయమందు విశ్వసించుచున్నాను; మరియు నా నోటితో ఒప్పుకొనుచున్నాను, నీ యందలి విశ్వాసము ద్వారా పాపక్షమాపణను మరియు శుద్ధీకరణను నేను పొందుకొనుచున్నాను.*

*యేసు నీకు వందనాలు. నిన్ను మరింతగా తెలుసుకొనుటకు, నీకు నమ్మకముగా ఉండుటకు మరియు నిన్ను ప్రేమించుటకు నాకు సహాయము చేయుము. ఆమెన్.*

# ఆల్ పీపుల్స్ చర్చ్ గురించి

బెంగుళూరు పట్టణానికి ఉప్పుగాను మరియు వెలుగుగాను ఉండాలని మరియు భారత దేశానికి మరియు ఇతర దేశాలకు దేవుని స్వరముగా ఉండాలనునది ఆల్ పీపుల్స్ చర్చ్ యొక్క దర్శనం.

ఇది మీకు మేమందిస్తున్న ఒక బహుమానం! ఇది ఉచితం!

ఈ పుస్తకాన్ని చదువుట ద్వారా మీరు ఆశీర్వదింపబడ్డారని మేము నమ్ముచున్నాము.

మీ వలె కొన్ని వేలమందికి ఈ పుస్తకాలు ఉచితముగా పంచబడ్డాయి. దేవుని వాక్యమును అనేకులతో పంచుకొనుటకు గాను, మీరు ఆర్థికంగా సహాయపడి మాతో భాగస్థులు కావలెనని ఆశించుచున్నాము. క్రమముగా మీరు ఇచ్చే ఆర్థిక సహకారము ఇతరులకు దేవుని వాక్యాన్ని అందజేయుటకు దోహదపడుతుంది. ప్రభువు మిమ్మును నడిపించిన ప్రకారము ఆల్ పీపుల్స్ చర్చ్‌తో భాగస్వాములు అవ్వండి. మీరు మీ ఆర్థిక సహాయాన్ని చెక్కు/డిమాండు డ్రాఫ్ట్/ మనియార్డరు ద్వారా "All Peoples Church, Bangalore" పేరుతో పంపగలరు.

మీరు మాకు లెటర్ వ్రాసేటప్పుడు ఇతర ప్రచురణలను కొరకు అడుగగలరు. మీ అభిప్రాయములు, ప్రార్థన అవసరతలతో పాటు ఈ పుస్తకం మీకు ఏలా సహాయపడిందో కూడా తెలియపరచండి. ఈ క్రింది చిరునామా ద్వారా మాతో సంప్రదించగలరు :


ALL PEOPLES CHURCH,
370, 11th Cross, 2nd Block,
R.T. Nagar, Bangalore-560 032
Karnataka, India.

Phone : 91-80 2354 4328
Email: contact@apcwo.org
Website: www.apcwo.org